ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★ సోమవారం 30 సెప్టెంబరు 2024

నత్తనడకన బస్టాండ్ మరమ్మతు పనులు 8లో

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం కాదు 7లో



రేషన్ బియ్యం తరలిస్తున్న ట్రక్కును పట్టుకున్న పోలీసులు(ఫైల్)

దర్జాగా రేషన్ బియ్యం దందా

- బేగంపేట, గోదావరిఖనిల్లో కింగ్‌పిన్‌లు
- బియ్యం సేకరణకు ముఠాలు
- ఆటోలు, మోపెడ్లు సమకూర్చుతున్న మాఫియా
- ప్రతి నెలా 1200టన్నులు మహారాష్ట్రకు..
- రవాణాకు ప్రత్యేక వాహనాలు... ఎస్కార్ట్ వ్యవస్థ

కోల్‌సిటీ, సెప్టెంబరు 29: పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం మాఫియా చేతుల్లోకి వెళుతోంది... ప్రతి నెలా జిల్లాలో వేల టన్నుల బియ్యం పక్కదోవ పడుతోంది... నియంత్రించాల్సిన శాఖల కనుసన్నల్లోనే దర్జాగా దందా సాగుతోంది. రామగిరి మండలం బేగంపేట, గోదావరిఖనిల్లో కింగ్‌పిన్‌లు ఈ రేషన్ అక్రమ దందాను శాసిస్తున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఈ కింగ్ పిన్‌లు దందాను తమ చేతుల్లోకి తీసుకుని ఏకచక్రాధిపత్యంగా రవాణా చేస్తున్నారు. వివిధ శాఖల్లోని 'పెద్దల'ను ప్రసన్నం చేసుకున్నామంటూ వారిపేరు వాడుకుని వేల టన్నుల బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. రవాణాకు సైతం ట్రక్కులనే వినియోగిస్తూ దర్జాగా, నిర్భయంగా దందాను కొనసాగిస్తున్నారు. ప్రతి నెలా ఈ రేషన్ బియ్యం దందాలో కోట్ల రూపాయల వ్యాపారం సాగుతుంటే లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి.

జిల్లాలో 416రేషన్ షాపులు ఉండగా 2,19,000 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా లబ్ధిదారులకు సుమారు 3,200టన్నుల బియ్యం పౌరసరఫరాలశాఖ ద్వారా విడుదల అవుతోంది. కొవిడ్ తరువాత కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంలో సబ్సిడీని భరిస్తున్నాయి. జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో పౌరసరఫరాలశాఖ విడుదల చేస్తున్న కోటాలో సరాసరి 70 నుంచి 75శాతం బియ్యం పంపిణీ జరుగుతున్నట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇక్కడే బియ్యం మాఫియా తన దందాకు తెరలేపుతోంది. ముఖ్యంగా అత్యధిక కార్డులు ఉన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బియ్యం సేకరణపై దృష్టి పెట్టింది. గోదావరిఖని, రామగిరి మండలం బేగంపేట, సుల్తానాబాద్‌లోని కొందరు రేషన్ బియ్యం దందా చేసే స్మగ్లర్లు ఏరియాల వారీగా గోడౌన్‌లు పెట్టారు. రేషన్ డీలర్లు, లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరిస్తున్నారు. రేషన్ డీలర్లకు విడుదలయ్యే కోటా నుంచి 20శాతం నుంచి 30శాతం నేరుగా సేకరిస్తున్నారు. రేషన్ కోటా విడుదల అయ్యిందంటే లబ్ధిదారుల నుంచి సేకరించడానికి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. గతంలో గ్రామాల్లో సంచార వ్యాపారం సాగించే చిరు వ్యాపారులను చేరదీసి వారి ద్వారా బియ్యం సేకరిస్తున్నారు. వారికి ఆటోలు, మోపెడ్‌లు సమకూర్చుతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల లోపే బియ్యం సేకరణ జరుపడం, తొమ్మిది గంటల కల్లా బియ్యాన్ని మాఫియా గోడౌన్‌లకు తరలిస్తున్నారు.

● స్మగ్లర్లకు అడ్డుకట్ట ఏది?

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్టులు పెడతామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. డీజీపీ సైతం కిందిస్థాయి అధికారులకు సూచన చేశారు. పౌర సరఫరాలశాఖ, పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు సంయుక్తంగా తనిఖీలు జరపాలని, సరిహద్దులు దాటకుండా కట్టడి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా పోలీసులు రేషన్ దందాను ఉపేక్షించవద్దని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. గతంలో రామగుండం కమిషనరేట్‌లో పలువురు స్మగ్లర్లపై పీడీ యాక్టులు పెట్టారు. కానీ ఇటీవల కాలంలో ప్రభుత్వశాఖల ఆపరేషన్‌లలో స్తబ్దత నెలకొన్నదనే ఆరోపణలున్నాయి. నియోజకవర్గాల వారీగా గుత్తాధిపత్యం సాధించే స్థాయిలో స్మగ్లర్లు కార్యకలాపాలు సాగిస్తుండడం పోలీస్‌శాఖకే సవాల్‌గా మారింది.

● కోట్లలో దందా...

పౌర సరఫరాలశాఖ ద్వారా 3200టన్నులు బియ్యం లబ్ధిదారులకు మంజూరు చేస్తుంటే ఇందులో 1200టన్నులకు పైగా అక్రమ రవాణా జరుగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. మినీ ట్రక్కులు, వ్యాన్‌లతో దర్జాగా రవాణా చేస్తున్నారు. మహారాష్ట్రలోని వివిధ కేంద్రాలకు నేరుగా రావాణా జరుగుతోంది. ఈ రేషన్ బియ్యంపై ఆధారపడిన కొన్ని పరిశ్రమలకు ఈ స్మగ్లర్లే నేరుగా రవాణా చేస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా కోట్ల రూపాయల్లో సాగుతోంది. డీలర్లు, వ్యాపారుల నుంచి రూ.10లకు కిలో చొప్పున సేకరణ చేసి రూ.20లకు మహారాష్ట్రలో విక్రయాలు జరుపుతున్నారు. సీఎంఆర్ బాకీ పడిన వివిధ జిల్లా మిల్లర్లకు సైతం ఇక్కడి నుంచే బియ్యం రవాణా జరుగుతున్నట్టు తెలుస్తున్నది. కోట్ల రూపాయల్లో దందా సాగుతుండగా లక్షల్లో ముఖ్యమైన శాఖలకు డబ్బులు చేతులు మారుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

● నియోజకవర్గానికి ఒక్కరే దందా చేసేలా..

జిల్లాలో రేషన్ బియ్యం దందాలో ఇటీవల కాలంలో స్మగ్లర్లు కూడా గుత్తాధిపత్యం సాధించుకున్నారు. వివిధ ప్రభుత్వశాఖల పెద్దల ఆశీస్సులున్నాయంటూ నేరుగా రంగంలోకి దిగారు. నియోజకవర్గానికి ఒక్కరే దందా చేసేలా అవగాహన చేసుకున్నారు. ఇందుకు కీలకమైన ప్రభుత్వశాఖల సహకారం కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. రామగిరి మండలంలోని బేగంపేట, గోదావరిఖనిలోని కింగ్‌పిన్‌లు జిల్లాలోని దందాను శాసిస్తున్నారు. రామగిరి మండలానికి చెందిన ఒక బియ్యం స్మగ్లర్‌కు చెందిన వాహనాలు ఇటీవల వరుసగా పట్టుబడ్డాయి. ఈ నెల 15న అర్ధరాత్రి బేగంపేట నుంచి మహారాష్ట్రకు రావాణా చేస్తున్న ఒక ట్రక్కును గోదావరిఖనిలో పోలీసులు పట్టుకున్నారు. ఇందులో ఏకంగా 10 టన్నుల రేషన్ బియ్యం దొరికింది. ఇందులో కొన్ని సివిల్ సప్లైకి చెందిన గన్నీ బ్యాగులు ఉన్నట్టు రేషన్ డీలర్లే పేర్కొంటున్నారు. ఇక గోదావరిఖనిలో స్క్రాప్ దందాను శాసిస్తున్న ఒక కీలకమైన వ్యక్తి ఇప్పుడు రేషన్ దందాలో కింగ్‌పిన్‌గా ఎదిగాడు. అతడు 200 నుంచి 250మంది వరకు బియ్యం సేకరణకే వినియోస్తున్నాడన్న ప్రచారం ఉంది. రామగుండం నియోజకవర్గంలో గుత్తాధిపత్యం సాధించినట్టు తెలుస్తోంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతం నుంచి రేషన్ బియ్యం మహారాష్ట్రకు తరలించే వరకు సొంతంగా ఎస్కార్ట్‌లు ఏర్పాటు చేసుకుంటున్నాడు. కాగా పోలీస్ కమిషనరేట్ కేంద్రమైన రామగుండంలో ఇతర ప్రాంతాల నుంచి రవాణా అయ్యే రేషన్ బియ్యం పట్టుబడుతుందే కానీ ఇక్కడి స్మగ్లర్లకు సంబంధించిన రేషన్ బియ్యం పట్టుబడడంలేదు. కమిషనరేట్‌లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ క్రైమ్ పార్టీలు, సివిల్ సప్లై, విజిలెన్స్‌ల కళ్లు గప్పి రవాణా జరుగుతుందా అనే సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

ఎన్టీపీసీలో ముగిసిన హిందీ పక్వాడా వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జ్యోతినగర్, సెప్టెంబరు 29: రామగుండం ఎన్టీపీసీలో జరుగుతున్న హిందీ పక్వాడా(పక్షోత్సవాలు) వేడుకలు శనివారం రాత్రి ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జాతిని ఐక్యం చేయడంలో హిందీ భాష ఎంతో దోహదం చేస్తుందన్నారు. దేశంలో విభిన్న భాషలున్నప్పటికీ హిందీ అన్ని భాషలకు అనుసంధానంగా పనిచేస్తుందన్నారు. హిందీని ఎన్టీపీసీలో విస్తృతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హిందీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించామని, ఉద్యోగులు, అధికారులతోపాటు వివిధ వర్గాలను భాగస్వాములను చేశామన్నారు. ప్రతీఉద్యోగి హిందీ భాషపై సంపూర్ణ అవగాహన ఉండాలని కోరారు. పక్షోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పదిహేను రోజులపాటు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఈడీ కేదార్ రంజన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఎంలు త్రిపాఠి, సురేష్ గుప్తా, దీప్తి మహిళా సమితి సభ్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

మల్కాపూర్ చెరువు వద్ద పారిశుధ్య కార్యక్రమాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 29: రామగుండం నగరపాలక సంస్థ ఐదో డివిజన్ పరిధిలోని మల్కాపూర్ మల్లపురాణి కుంట వద్ద కార్పొరేషన్ సిబ్బంది ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, సూపర్‌వైజర్ బండారి రవి, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ కాని వారు కలెక్టరేట్‌కు తరలిరావాలి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 29: రుణమాఫీ కాని రైతులు అక్టోబరు 1న పెద్దపల్లి కలెక్టరేట్‌కు తరలిరావాలని మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి కునారంలో విలేకరుల సమావేశంలో సంపత్ మాట్లాడారు. నియోజకవర్గంలో రెండు లక్షల రుణాలు తీసుకున్న వారి రుణమాఫీ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు లక్షల పైన రుణం ఉంటే ఆ రుణం కడితేనే రుణమాఫీ చేస్తామని బ్యాంకర్లు ఆంక్షలు విధించడంతో రైతులు రుణం కట్టలేక ఇబ్బంది పడుతున్నారన్నారు.

ఈ విషయంపై అక్టోబరు 1న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతుల కోసం పెద్దపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రుణమాఫీ కాని రైతులు తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, మాజీ సర్పంచ్ బుర్ర మంగా సదానందం, మాజీ ఎంపీటీసీలు కొల్లూరి రమాదేవి రాజమల్లు, జెట్టి దేవేందర్, బీఆర్ఎస్ నాయకులు కుంభం రాజు పాల్గొన్నారు.

ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

ఎలిగేడు, సెప్టెంబరు 29: రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ధూళికట్ట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ సర్వసభ్య సమావేశం చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై మాట్లాడారు. రైతులకు వ్యవసాయ పరపతి సంఘాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అర్హులైన ప్రతీ రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. నిరంతరం రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలుచేసి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతుల పంట కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి, రైతులకు సహకార సంఘాలు వారధిగా పనిచేస్తున్నాయని కొనియాడారు. రైతులను రాజులుగా చేయడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో పంటించిన సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందన్నారు. అర్హులైన వారందరికీ తెల్లరేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు అందిస్తామన్నారు. అతిత్వరలో ఇల్లులేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పీఏసీఎస్ చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ సంఘంలో 2,560మంది సభ్యులు ఉన్నారని వారి వాటా ధనం 1,50,63,644 రూపాయలు కలిగి ఉన్నారన్నారు. వివిధ గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం మూడు మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. రూ. 2లక్షల లోపు రుణాలు ఉన్న 501మంది రైతులకు రూ.3.39కోట్ల రుణమాఫీ చేసి తిరిగి మళ్లీ రుణాలు ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ స్రవంతి, ఉపాధ్యక్షుడు కంది మల్లారెడ్డి, డైరెక్టర్లు బత్తిని లచ్చయ్య, పోల్సాని పుల్లారావు, కాల్వ ఐలయ్య, కన్నం లక్ష్మి, కొమ్ము లక్ష్మి, రెవెల్లి సమ్మయ్య, కొమ్మ భూమయ్య, కల్వల ఎల్లమ్మ, గండు భగవంత రావు, మాదారపు శ్రీనివాస్‌రావు, బసారపు రాజయ్య గౌడ్, కార్యదర్శి బద్ద రవీందర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు, మినిపాల ప్రకాష్‌రావు బుద్దినేని వామన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుల, మతరహిత సమాజం కోసం పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఈదునూరి నరేష్

అంతర్గాం, సెప్టెంబరు 29: సత్య శోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల, మత రహిత సమాజం కోసం పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా నాయకుడు ఈదునూరి నరేష్ అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు అంతర్గాం మండల పరిధిలోని పేద్దపేటలో కుల నిర్మూలన సదస్సును నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. కుల వివక్ష, పీడన లేని సమాజం నిర్మాణం కోసం ప్రజలంతా సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ నాయకులు మేరుగు చంద్రయ్య, కోడిపుంజుల జ్యోతి, కొల్లూరి మల్లేష్, ఆనంద్, వేల్పుల సాంబయ్య, రాజయ్య పాల్గొన్నారు.

ఎస్‌డీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం

కోల్‌సిటీ, సెప్టెంబరు 29: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) నిధులతో స్థానిక 7వ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం కార్పొరేటర్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బొంతల రాజేష్ మాట్లాడుతూ రామగుండం అభివృద్ధికి రాజ్‌ఠాకూర్ ప్రభుత్వం నుంచి వందల కోట్ల నిధులు మంజూరు చేయిస్తున్నాడన్నారు. వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్ అభివృద్ధికి నిధులు వెచ్చించారని, అన్నీ డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏడో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ నాజీమోద్దీన్, కార్పొరేటర్ వేగోళపు రమాదేవి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయ కులు కంకణాల మౌనికరాజు, కోదాటి వినోద్, ఆరీఫ్, అజయ్, అక్బర్, కళ్యాణ్‌నగర్, ఓదెలు, కాలనీవాసులు అర్కుటి శంకర్, దశరథ, నిర్మల పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న బొంతల రాజేష్

రామగుండంలో వరుస బైక్ చోరీలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 29: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 15 రోజులుగా వరుస బైక్ చోరీలు జరుగుతున్నాయి. గోదావరిఖని పట్టణంతో పాటు ఎన్టీపీసీ ప్రాంతంలో బైక్ చోరీల ఘటనలు చోటు చేసుకున్నాయి. గోదావరిఖని మెయిన్ చౌరస్తా, శారదానగర్, గాంధీనగర్, ఎన్టీపీసీ, భరత్‌నగర్ ప్రాంతాల్లో బైక్‌లు చోరీకి గురయ్యాయి.

శనివారం రాత్రి గాంధీనగర్ వంకబెండు పంపు వద్ద నివాసముండే సాయి తరుణ్ అనే వ్యక్తికి చెందిన టీఎస్22జే0115 ఇంటిముందు పార్క్ చేయగా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అయితే మెయిన్ చౌరస్తాలోని సర్వర్ హోటల్ యజమానికి చెందిన బైక్ చోరీకి గురైంది. శారదానగర్ ఐస్‌క్రీమ్ పార్లర్ వద్ద పార్కు చేసిన వాహనాన్ని కూడా ఎత్తుకెళ్లారు. బాధితులు ఠాణాల్లో ఫిర్యాదు చేశారు.

శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ క్వార్టర్లు

- ఇరవై ఏళ్లకు పైగా నిరుపయోగంగా గదులు
- పట్టించుకోని అధికారులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 29: దాదాపు యాభై ఏళ్ల కిందట నిర్మించిన అధికారులు నివాస సముదాయాలు ఉపయోగంలో లేక ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. ఒకప్పుడు అధికారులు వారి కుటుంబ సభ్యులతో కళకళలాడిన క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా కూడా మారాయి. ఒకప్పుడు అంటే మండల వ్యవస్థ రాకముందు సుల్తానాబాద్ సమితి కేంద్రంగా విరాజిల్లుతుండేది. దాదాపు వంద గ్రామాలు ఈ సమితి పరిధిలో ఉండేవి. ప్రస్తుత జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని రాయపట్నం వరకూ సుల్తానాబాద్ సమితిలోనే ఉండేవి. అప్పటి అధికారులను బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి (బీడీవో) గానూ, ప్రజాప్రతినిధిని సమితి అధ్యక్షుడిగా పిలవబడేవారు. వంద గ్రామాల ప్రజలు ఈ సమితీ సర్వసభ్య సమావేశాలకు హాజరయ్యేవారు. ఇలా ఆనాటి సమితి, తాలూకా వ్యవస్థలు ఉన్నపుడు ఆయా శాఖల అధికారులు ఇక్కడే నివాసం ఉండేందుకు ప్రభుత్వం పదికి పైగా క్వార్టర్లు నిర్మించింది. కోర్టు, ఆస్పత్రి కూడా ఆనాటి నుంచే ఉండడంతో ఈ క్వార్టర్లలో మెజిస్ట్రేట్లు, డాక్టర్లు, తహసీల్దార్లు, బీడీవోలు ఇతర అధికారులు నివాసం ఉండేవారు. ఎపుడైతే మండలాలు ఏర్పడ్డాయో ఆనాటి నుంచి పరిధి తగ్గిపోయి అధికారులు స్థానికంగా ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో ఇక్కడి మండల పరిషత్ క్వార్టర్లు నిరుపయోగంగా మారాయి. కొంతకాలం జడ్పీటీసీ నివాసానికి ఒక క్వార్టర్‌ను మరమ్మతులు చేయించి ఇచ్చారు. మరి కొన్నింటిలో ఎంపీటీసీల కోసం, ఇతర సహకార హౌసింగ్ అంటూ విద్యుత్ శాఖ వారికి రెండు, 108 అంబులెన్సు సిబ్బంది కోసం కూడా ఇచ్చారు. కానీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలో తీసుకురాలేకపోయారు. దాంతో క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. వాటిలో చెత్త చెదారంతో పాటు పిచ్చి మొక్కలు చెట్లు మొలిచి పూర్తి అపరిశుభ్రంగా మారాయి. ఇటీవల ఓ క్వార్టర్లో ఉన్న ఓ చెట్టుకు సుభాష్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసకున్నాడు. ఈ ఉదంతం సంఘటన జరిగిన పది రోజులు తర్వాత దుర్గంధం వెదజల్లడం ద్వారా వెలుగు చూసింది. ఖాళీగా ఉన్న క్వార్టర్లను పలు ప్రభుత్వ శాఖల వారికి ఇచ్చి వాటిని ఉపయోగించినా బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు.



శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ క్వార్టర్లు

● జోరుగా ఆక్రమణలు..

మండల పరిషత్ క్వార్టర్లు ఓ వైపు ఖాళీగా ఉంచిన అదికారలు కనీసం ఆక్రమణలను కూడా అడ్డుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల పరిషత్ క్వార్టర్ల వెనక భాగంలో చాలామంది క్వార్టర్ల గోడలను అనుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. వీటికి ఆనాటి గ్రామ పంచాయతీ వారు ఇంటి నంబర్లను కూడా అలాట్ చేయడం గమనార్హం. ప్రభుత్వ క్వార్టర్ల స్థలాన్ని అక్రమించుకున్న విషయం బాహాటంగా తెలిసినా నివారణ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం అయ్యారని పలువురు విమర్శిస్తున్నారు.

● షాపింగ్ కాంప్లెక్స్‌కు ప్రతిపాదనలు..

గత ప్రభుత్వ హయాంలో ఈ మండల పరిషత్ క్వార్టర్లను పూర్తిగా తొలగించి ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. కానీ అవి అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా పాత వాటిని పూర్తిగా తొలగించి ఈ స్థలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫైనాన్స్ వ్యాపారిపై సీపీకి ఫిర్యాదు

హుజూరాబాద్, సెప్టెంబరు 29: హుజూరాబాద్‌కు చెందిన ఓ ఫైనాన్స్ వ్యాపారి డబ్బుల కోసం ఓ ప్రజాప్రతినిధిని బెదిరింపులకు గురి చేయడంతో ఆదివారం సీపీకి ఫిర్యాదు చేశారు. 40ఏళ్లుగా హుజూరాబాద్‌లో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గతంలో పోలీసులు కూడా ఇంటిపై రైడింగ్ చేసి, నగదును పట్టుకున్నారు. మండలంలోని ఓ ప్రజాప్రతినిధిని దూషించడంతో ఆదివారం సీపీ అభిషేక్ మొహంతికి ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించినట్లు సమాచారం.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, సెప్టెంబర్ 29: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. కొర్కల్ గ్రామానికి చెందిన టాక్టర్ యాజమానులు సంపంగి రాములు, సుద్దాల దేవుడు అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలి

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 30: ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను సరి చేసిన తర్వాతనే జీవో 25ను అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని వివేకానంద విద్యానికేతన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పీఆర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా కార్యకర్తల శిక్షణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు తప్పని సరిగా తమ సర్వీస్‌కు సంబంధించిన లీవ్‌రూల్స్, పెన్షన్‌పై కనీస అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆ ఉద్దేశంతోనే ఎస్టీయూ ఉపాధ్యాయులందరికీ అనుభవజ్ఞులైన వారిచే శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. సీసీఏ రూల్స్, ఫిక్సేషన్, సీనియార్టీ లెక్కింపు తదితర అంశాలపై సీనియర్ నాయకుడు పి.రమేశ్, శ్రీధర్‌రావు, సుధాకర్, పున్న గణేశ్ తదితరులు అవగాహన కల్పించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో పదవీ విరమణ, పదోన్నతులు పొందిన సంఘ బాధ్యులను ఘనంగా సన్మానించారు. ఈసమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి రవీంద్రాచారి, సతీష్, శ్రీకాంత్ రెడ్డి, హరికిరణ్, శంకర్, వివేకానంద విద్యానికేతన్ చైర్మన్ సొగాని కొమురయ్యమ, రాష్ట్ర బాధ్యులు భూమయ్య, రవి, సంతోష్‌కుమార్, తిరుపతిరావు, సాన కిషన్, దయానంద్, తిరుపతిరెడ్డి, వెంకటస్వామి, రాజు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఆస్తి పంచాయితీ

● మొదటి భార్య పిల్లల దాడిలో తండ్రి మృతి

వేములవాడ, సెప్టెంబరు 29: ఆస్తి కోసం మొదటి భార్య పిల్లలు పెట్టిన పంచాయితీ ఘర్షణకు దారితీసింది. పిల్లలు చేసిన దాడిలో తండ్రి మృతి చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఆదివారం చోటుచేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడకు చెందిన మామిం డ్ల మల్లయ్య (53) మొదటి భార్య బాలవ్వ 15 సంవత్సరాల క్రితం మరణించింది. మొదటి భార్య ద్వారా మల్లయ్యకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మొదటి భార్య మరణానంతరం మల్లయ్య పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. పద్మ ద్వారా ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు జన్మించారు. తమకు రావాల్సిన వాటా ప్రకారం ఆస్తి రాసి ఇవ్వాలంటూ మల్లయ్య మొదటి భార్య కుమారుడు రాజు, కుమార్తెలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కుల పెద్దల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేశారు. పంచాయితీ జరుగుతున్న క్రమంలో వెంటనే ఆస్తి రాసి ఇవ్వాలంటూ రాజు డిమాండ్ చేయగా రెండో భార్య పిల్లలు చిన్న వాళ్లని, వాళ్ల పెరిగి పెళ్లిళ్లు చేసిన అనంతరం ఆస్తి పంపకాలు చేస్తానని చెప్పి మల్లయ్య పంచాయితీ మధ్యలో నుంచి బయటకు వెళ్లిపోయేందుకు ప్రయత్నించాడు. ఆవేశానికి లోనైన కుమారుడు రాజు, కుమార్తెలు, అల్లుళ్లు మల్లయ్యను అడ్డుకొని గొడవకు దిగారు. మల్లయ్య అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వారు మల్లయ్య ఉన్న ఇంటికి వచ్చి కత్తి, కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ మల్లయ్య కుప్పకూలాడు. చికిత్స కోసం ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మల్లయ్య రెండో భార్య పద్మపై కూడా దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం పద్మను కరీంనగర్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ వీరప్రసాద్ పరిశీలించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

దిగువకు విడుదల అవుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువ గోదావరి లోకి ఆదివారం వరద నీరు విడుదల కావడం కొనసాగింది. ప్రాజెక్టుకు చెందిన పది గేట్లను ఎత్తి గోదావరిలోకి 29,678 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 44,268 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 44,268 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ అంతర్ జిల్లా జట్ల ఎంపిక



అంతర్ జిల్లా జట్టుకు ఎంపికయిన క్రీడాకారులు

మానకొండూర్, సెప్టెంబరు 29 : మానకొండూర్‌లోని గురుకుల పాఠశాలలో ఆదివారం బాల్ బ్యాడ్మింటన్ అండర్-19 జూనియర్స్ బాల బాలకల అం తర్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టుకు కే యశ్వంత్, బి అనివర్స, జే వేణు, బి సాయిరాం, కే అభిలాష్, బి స్వాతిక్‌నాయక్, ఎస్‌కే ఫైజాన్, బి విగ్నేష్, డి దినేష్‌కార్తిక్, అభిలాష్ ఎంపిక అయ్యారు. బాలికల జట్టుకు మానస, వినుత, సిరిచందన, సిరివర్షిని, సాయిుతి, నేహ, స్నేహిత, కళ్యాణి, రమ్య, జేష్విలు ఎంపిక అయ్యారు. త్వరలో కామారెడ్డిలో నిర్వహించే అంతర్ జిల్లా పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి, ఏ రాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వినోద్‌కుమార్, పీఈటీలు వి శివప్రసాద్, అలేఖ్య, భవాని పాల్గొన్నారు.



ఇప్పపల్లి - పోతారం అడవుల్లో చదును చేసిన అటవీ భూమి



నరికివేసిన చెట్లు

కనుమరుగవుతున్న అటవీ సంపద

● కాకి లెక్కలతో తప్పుదోవ
● అవినీతి ఫలితమే అడవి ధ్వంసం

కథలాపూర్, సెప్టెంబరు 29 : అడవి తల్లిపై గొడ్డలి వేటు కారణంగా వందలాది ఎకరాల దట్టమైన అడవులు కనుమరుగవుతున్నాయి. అడవిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కొందరు అధికారుల నిర్వాకం ఫలితంగా ఏటేటా ఎడారిగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవినీతికి అలవాటు పడి అనధికారిక అనుమతులు ఇస్తున్న క్రమంలోనే యంత్రాలు అడవిలోకి ప్రవేశించి పచ్చని చెట్లు నేల కూల్చడానికి ఆస్కారం కలుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఓ వైపు అటవీ విస్తీర్ణం పెంచడానికి పాటు పడాలని సూచిస్తుండగా ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డ అధికారుల కారణంగా రోజు రోజుకూ పదుల ఎకరాల మేర ధ్వంసం అవుతుందనే అపవాదు మూటగట్టుకుంటున్నారు. మండలంలోని ఇప్పపల్లి-పోతారం గ్రామాల మధ్య గడిచిన రెండేళ్లుగా కొనసాగుతున్న వివాదం పరిష్కరించడంలో చేస్తున్న జాప్యం భారీ నష్టానికి దారి తీసిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

● లెక్కకు మించి ధ్వంసం

అటవీ భూములపై కన్నేసిన కొందరు రాత్రి వేళల్లో యంత్రాలతో చెట్లను తొలగించి బ్లేడ్ ట్రాక్టర్లతో చదును చేస్తున్నప్పటికీ పహారా కాయాల్సిన అధికారులు అటువైపు నామమాత్రంగా వెళ్తుండడం పలు అను మానాలకు తావిస్తోంది. విచ్చలవిడిగా అడవిని నరికి వేస్తున్నట్టు అనేక ఫిర్యాదులు వస్తుండగా కఠిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వస్తున్నాయి. పోతారానికి చెందిన కొందరు అడవిలో అడ్డా వేయడానికి ఫారెస్ట్ అధికారుల ప్రమేయం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. అయితే ఆ శివారు తమదేనంటూ ఇప్పపల్లి వాసులు వాదిస్తున్న నేపథ్యంలో సరిహద్దు వివాదం రాజుకుని రగులుతోంది. ఇప్పటికే సుమారు 300 ఎకరాల మేర అడవి ధ్వంసం అయిందనే ఆరోపణలు వస్తుండగా ఫారెస్ట్ యంత్రాంగం మాత్రం 50 ఎకరాల లోపు మాత్రమే పోడుకు గు రైందని పేర్కొంటున్నారు. ధ్వంసం కాబడ్డ పరిసరాలను చూసిన అధికారులు మాత్రం ఎంత మేర అటవీ భూమి నష్టపోయిందని మాత్రం అధి కారికంగా ప్రకటించడం లేదు. యథేచ్ఛగా అడవి నరికివేతకు గురవు తున్న క్రమంలో ఇరు గ్రామాల మధ్య శాంతి భద్రతల సమస్యగా పరిణ మించింది. తమ శివారు అడవిని కాపాడుకుందామని ప్రయత్నాలు చే స్తుంటే తమపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పపల్లి వా సులే అడవిని నరికివేస్తున్నారని పోతారానికి చెందిన పలువురు ఫిర్యా దులు చేసుకుంటుండడం సర్వసాధారణంగా మారిపోయింది. కంచే చేను మేసిన చందంగా ఓ అటవీ అధికారి నిర్వాకంపై మండలంలో తీవ్ర చర్చ జరుగుతోంది. అవినీతి ఫలితంగానే అడవి విధ్వంసానికి కారణమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరుగురిపై కేసులు నమోదు చేశాం

రాజారాం తండాలో సుమారు పదెకరాల మేర అడవిని నరికినట్లు మా సిబ్బంది గుర్తించారు. ధ్వంసం చేసిన వారి వివరాలు సేకరించాము. ఆరుగురిపై అటవీ చట్టం కింద కేసులు నమోదు చేసాం. ఇప్పపల్లికి చెందిన 10 మందిపై కేసులు నమోదు చేసి చార్జిషీట్ కోర్టులో వేస్తున్నాం. అడవిని నరికి వేసే వారిపై కఠినంగా ఉంటాం. సిబ్బందిని ప్రమత్తం చేస్తున్నాం.

- పద్మారావు, ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో, మెట్‌పల్లి

గోదావరిలో కొట్టుకుపోయిన ముగ్గురు యువకులు

● ఒకరి గల్లంతు.. ఇద్దరిని కాపాడిన జాలర్లు

ధర్మపురి, సెప్టెంబరు 29 : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని రాయపట్నం గోదావరి నదిలో ఆదివారం ముగ్గురు యువకులు కొట్టుకుపోయారు. ఇందులో ఇద్దరు యువకులను జాలర్లు కాపాడారు. మరో యువకులు గల్లంతయ్యాడు. కరీంనగర్, శ్రీనగర్ కాలనీకి చెందిన రాగుల పవన్ కుమార్ (19) అనే యువకుడు తన స్నేహితులు కొట్టె నవీత్ వర్మ, బోగే అశ్విన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై దుర్గాదేవి మాలధారణ సందర్భంగా రాయపట్నం గోదావరి స్నానానికి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో గోదావరి నదిలో దిగి స్నానం చేస్తుండగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ముగ్గురు యువకులు అందులో కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న జాలర్లు గమనించి నవిత్, అశ్విన్ లను బయటకు తీశారు. అనంతరం వైద్య చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. మరో యువకుడు రాగుల పవన్‌కుమార్ ఆచూకీ మాత్రం తెలియలేదు. పవన్ తండ్రి రాగుల రాజు ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గంగుల మహేష్ తెలిపారు.

చుండూరు సీతకు రజనీశ్రీ పురస్కారం



పురస్కారం అందజేస్తున్న జీవీ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 29: ప్రతీయేటా రాష్ట్ర స్థాయిలో జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ పురస్కార ప్రదాతగా తన తండ్రి పేరిట ఇచ్చే రజనీశ్రీ పురస్కారాన్ని చుండూరు సీతకు ప్రదానం చేశారు. కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నవలా విభాగంలో సారంగి నవలకు గాను చుండూరు సీతకు పురస్కారం కింద 10,116 రూపాయల నగదు, జ్ఞాపికను పురస్కార ప్రదాత జీవి శ్యాంప్రసాద్‌లాల్ అందించి సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సారంగి నవల చదువుతుంటే విశ్వనాథ గుర్తుకు వస్తారని, అద్భుత కవిత్వ శైలితో, భావుకతతో ఈ నవల సాగిందని అన్నారు. పురస్కార గ్రహీత సీత మాట్లాడుతూ నిరంతర సాహితీ చైతన్యంతో వెల్లివిరిసే కరీంనగర్ జిల్లా గడ్డపై తాను ఒక మహనీయుని పేరిట పురస్కారాన్ని స్వీకరించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గాజుల రవీందర్, రజనీశ్రీ సతీమణి గాజుల సత్యవతి, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ మచ్చ హరిదాసు, దాస్యం సేనాధిపతి, డాక్టర్ పొన్నం రవిచంద్ర, అన్నవరం దేవేందర్, సంస్థ ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్ సమన్వయం మధ్య సాగిన ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు స్తంభంకాడి గంగాధర్, ముత్తినేని శ్రీనివాస్, గంగుల శ్రీకర్, అనంతోజు పద్మశ్రీ, నీలగిరిఅనిత పాల్గొన్నారు.

సమాజంలో అసమానతలు తొలగించడానికి మహిళలు పోరాటం చేయాలి

భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 29 : సమాజంలో అసమానతలు తొలగించడానికి మహిళలు పోరాటానికి సిద్ధంకావాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సనాతన ధర్మం పేరుతో స్త్రీలపై విధించిన ఆంక్షలు, మూఢాచారాలు, కట్టుబాట్లతో మహిళా శక్తిని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. వీటిని ప్రతిఘటించి పెట్టుబడిదారి వ్యవస్థకు ఘోరి కట్టి పురుష ఆధిపత్యం లేని పాలన చేయాలన్నారు. స్త్రీలు పురుషులతో సమానంగా పని చేస్తున్నారని, మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని తెలిపారు. కానీ నేడు దేశంలో మహిళలపై అత్యాచారాలు, వరకట్న దురాచారాలకు బలవుతూనే ఉన్నారని ఆమె ఆవేదన వెలిబుచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. గ్రామ స్థాయిలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూను నిర్మించి మహిళ సాధికారితక పోరాటాలను తీవ్రతరం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు తాండ్ర సదానందం మాట్లాడుతూ నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో మహిళల స్థితి దిగజార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆర్థిక విధానాలను అవలంబిస్తున్నారని, వీటిని మహిళలు ఐక్య ఉద్యమాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు శనిగరపు తిరుమల, విజయలక్ష్మి, భాగ్య, ఓదమ్మ, తార, రాజమ్మ, విజయ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జ్వరంతో చిన్నారి మృతి



మనీషా (ఫైల్)

రాయికల్, సెప్టెంబరు 29 : మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన తాలుక మనీషా (12) జ్వరంతో శనివారం అర్ధరాత్రి మృతి చెంది నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మనీషా 7వతరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు చిన్నారిని జగిత్యాలలోని ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరం తీవ్రం కావడంతో ఆమెను కుటుంబసభ్యులు కరీం నగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతి చెం దినట్లు తెలిపారు. గ్రామంలో జ్వరాలతో గ్రామ స్థులు, పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నార ని, అధికారులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 29: శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామ శివారులో కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆముదాపల్లి గ్రామానికి చెందిన గడ్డం కుమారస్వామి, చిమ్మని అనుదీప్ అనే వ్యక్తులు ఆముదాలపల్లి నుంచి కేశవపట్నం వైపు కారులో వెళ్తున్నారు. ఆము దాలపల్లి నల్లాల బావి సమీపంలో కారు అదుపు తప్పి బండకు ఢీ కొని పొలంలోకి దూసు కెళ్లింది. ఈ ప్రమాదంలో కుమారస్వామి, అనుదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మానేరువాగులో మూడు ఇసుక ట్రాక్టర్ల గల్లంతు

● వాహనాలను వదిలి ఒడ్డుకు చేరుకున్న డ్రైవర్లు, కూలీలు

మానకొండూర్, సెప్టెంబరు 29: మండలంలోని శ్రీనివాస్‌నగర్ మానేరువాగులో మూడు ఇసుక ట్రాక్టర్లు శనివారం రాత్రి గల్లంతయ్యాయి. కాగా డ్రైవర్లు, కూలీలు వాహనాలను వదలి ఒడ్డుకు చేరుకోవడంతో ముప్పు తప్పింది. ఇసుకను కరీంనగర్‌కు తరలించేందుకు రాజు, అంజి, మల్లేశం అనే ట్రాక్టర్ల యజమానులతో పాటు మరో ముగ్గురు కూలీలు శనివారం సాయంత్రం మానేరువాగులోకి వెళ్లారు. అప్పటికి ఎల్ఎండీ గేట్లు తెరిచారన్న సమాచారం లేకపోవడంతో మూడు ట్రాక్టర్లు వాగులోకి తీసుకెళ్లి ఇసుకను లోడు చేశారు. తిరిగి వెళ్లే సమయానికి నీటి ఉధృతి పెరిగింది. దీంతో ఆందోళనకు గురైన డ్రైవర్లు ఒడ్డుకు చేరేం దుకు వెళ్తుండగా మొదటి ట్రాక్టరు దిగబడిపోయింది. నీటి ప్రవాహం అధికం కావడంతో డ్రైవర్లు, కూలీలు చేసేది ఏమీ లేక ట్రాక్టర్లను వాగులో వదిలేసి ఒడ్డుకు చేరుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

● ఎనిమిది మంది అరెస్టు
● రూ. ఎనిమిది వేలు స్వాధీనం

జ్యోతినగర్, సెప్టెంబరు 29 : ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజయ్‌గాంధీ నగర్లో ఆదివారం ఒక పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. సంజయ్ గాంధీ నగర్‌లో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, సిబ్బంది స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 8,040 రూపాయలను సీజ్ చేశారు. అలాగే ఐదు సెల్‌ఫో న్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎన్టీపీసీ పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ధర్మారం, సెప్టెంబరు 29: ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి వద్ద రాష్ట్ర రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వామి నాయక్(30) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. ఆదివారం మండలంలోని లంబాడితండ కె గ్రామానికి చెందిన అజ్మీర స్వామి నాయక్, గాదం రవి ఇద్దరు వ్యక్తులు బైకుపై ధర్మారం వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వామి నాయక్‌ను కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. అతి వేగంగా నడిపిన కారు డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం కాదు

● అన్ని వర్గాలకు న్యాయం జరగాలి ● మాలల ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజు



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజు, మాల సంఘాల నాయకులు

జ్యోతినగర్, సెప్టెంబరు 29 : ఎస్సీ వర్గీకరణకు, సుప్రీంకోర్టు తీర్పునకు తాము వ్యతిరేకం కాదని చెన్నూరు, వర్ధన్న పేట ఎమ్మెల్యేలు జి వివేక్, కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మాల పెద్దపల్లి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీపీసీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మాలల ఆత్మీయ సదస్సులో వారు ప్రసంగించారు. తాము అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అన్నివర్గాలకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామన్నారు. తాజాగా కులగణన జరిగిన తరువాతనే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల అమలు జరగాలనేది తమ ప్రధాన డిమాండ్ అన్నారు. మాలలపై పెద్ద ఎత్తున దాడి జరుగుతున్నదని, మంద కృష్ణమాదిగ, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాలలపై వ్యతిరేకంగా మాట్లాడు తన్నారన్నారు. మాదిగలకు మాలలు ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తప్పుడు భావజాలాన్ని మాదిగలలో నింపేదుకు కుట్ర జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారంతో ప్రజల్లో మాలలను అప్రతిష్టపాలు చేసేందుకు జరుగుతున్న కట్రలను ఆపేయాలన్నారు. ఎన్నికల సమయంలో తమపై తప్పుడు ప్రచారం చేశారని, నేటికీ తాము మాదిగలకు వ్యతిరేకమంటూ సామాజిక మాధ్యమల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. అన్నికులాల వారు సభలు, సమావేశాలు జరుపుకుంటారని, మాలలు సమావేశం నిర్వహిస్తే ఎందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. అన్నిరాజకీయ పార్టీలను కలుపుకొని శాస్త్రీయమైన వర్గీకరణ కోసం కృషిచేస్తామని తెలిపారు. అన్ని జిల్లాల్లో మాలలు, మాల ఉద్యోగులు ఐక్యంగా ఉడాలని, ఐక్యంగా ఉన్నప్పుడే తమ హక్కులు, డిమండ్లను సాధించవచ్చని తెలిపారు. మాలలను ఏకం చేస్తూ నవంబర్‌లో హైదరాబాద్ వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయిచామన్నారు. సభకు ముందు నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు టీం జిల్లా అధ్యక్షుడు బద్దం డానియెల్ అధ్యక్షత వహించగా, సమతా సైనికదళ్ జాతీయ కార్యదర్శి దిగంబర్‌కాంబ్లీ, డేనియల్, మాలల సంఘం సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, ముక్క సుదర్శన్, కె ఆనందర్, కార్పొరేటర్లు జేవీ రాజు, దొంత శ్రీనివాస్, దేవ వెంకటేశం, దామెర నర్సయ్య, రమేష్, పసుల రామ్మూర్తి, రమేష్, భాస్కర్, నర్సయ్య, జగన్, మోహన్, రవికుమార్, దీపక్, కకకరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి

● అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అంజి రెడ్డి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 29: రాష్ట్రంలో లారీ ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సి. అంజిరెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్క్రాప్ పాలసీ, క్వార్టర్లీ టాక్స్ మాఫీ, సింగిల్ పర్మిట్ తదితర అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించుకునే వరకు లారీ ఓనర్స్ ఐక్యంగా కదలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పెద్దపల్లి లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ భారీ, కార్యదర్శి బూత్కూరి తిరుపతి, ఉపాధ్యక్షుడు పి శీనివాస్, సంయుక్త కార్యదర్శి ఎండీ జహంగీర్, కోశాధికారి ఎండీ అఫ్జల్, రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఊర చెరువులో పడి ఒకరి మృతి

చిగురుమామిడి, సెప్టెంబరు 29: మండలంలోని చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన కయ్యం నరేష్(18) అనే వ్యక్తి ఆదివారం ప్రమాదవశాత్తు ఊర చెరువులో మునిగి మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఐదుగురు ఆదివారం చేపల వేటకు వినియోగించే తెప్ప పై సరదాగా ఊర చెరువులోకి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బోటు మునిగింది. దీంతో నరేష్ అనే వ్యక్తి నీటిలో పడి మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చెరువులో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మిగితా నలుగురు సురక్షితంగా ఉన్నారు. ఎస్సై బండి రాజేశ్ చెరువు వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. నరేష్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మపురిలో ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు



ధర్మపురి క్షేత్రంలో బొడ్డెమ్మ ఊరేగింపులో యువతులు

ధర్మపురి, సెప్టెంబరు 29 : ధర్మపురి క్షేత్రంలో బొడ్డెమ్మ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దంభట్ల వారి వీధి, రామానందేశ్వర వారి వీధి ఆధ్వర్యంలో వేర్వేరుగా నెలకొల్పిన బొడ్డెమ్మను అత్యంత భక్తి శ్రద్ధలతో మహిళలు పూజించారు. అనం తరం మహిళలు సాయంత్రం వేళలో బొడ్డెమ్మతో గోదా వరి నదికి బయలు దేరారు. రాత్రి నదీ తీరాన బొడ్డె మ్మను గోదావరి నదిలో నిమజ్జనం చే శారు. ఈ సందర్భంగా పట్టణ పురపాలక సంఘం ఆధ్వర్యంలో గోదావరి నదీ తీరాన విద్యుత్ దీపాలు అలంకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ 3. 4వ వార్డు కౌన్సిలర్లు సంగనభట్ల సంతోషి, పురాణపు కిరణ్మయి, శారదా మహిళా మండలి అధ్యక్షురాలు మధ్వాచారి విజయలక్ష్మి, కార్యదర్శి బావి శోభారాణి, గుండి రమాదేవి, రమావాణి, బొజ్జ పుష్ప, సభ్యులు పాల్గొన్నారు. సీఐ రాంనర్సిం హారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ గంగుల మహేష్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నత్తనడకన బస్టాండ్ మరమ్మతు పనులు

● ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్న ప్రయాణికులు ● పనులు వెంటనే పూర్తి చేయాలంటున్న ప్రజలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 29: సుల్తానాబాద్ ఆర్టీసీ బస్‌స్టేషన్ సముదాయానికి సంబంధించిన స్లాబ్ కూల్చివేయించిన అధికారులు పనులు మాత్రం వేగవంతంగా చేయించడం లేదు. దాంతో ప్రయాణికులు నిత్యం ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బస్టాండ్‌లో అనేక అవస్థలు పడుతున్నారు. పనులు వేగవంతంగా చేయించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవని దాంతో తాము ఇక్కడ అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్, గోదావరిఖని, మంచిర్యాల, మంథని మార్గంలో సుల్తానాబాద్ కేంద్రంగా ఉంటుంది. ఇక్కడి నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాష్ట్రంలోని పలుకేంద్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

సుల్తానాబాద్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 25 ఏప్రిల్ 1986న రవాణా శాఖ మంత్రి కుందూరు జానారెడ్డి బస్టాండ్ సముదాయాన్ని ప్రారంభించారు. నలభై ఏళ్లు కావస్తుండడంతో భవనం శిథిలావస్థకు చేరింది. బస్టాండ్ పైకప్పు శిథిలాలు తరుచుగా ఊడి పడడం వంటి సంఘటనలు జరిగాయి. ఈ ఘటనల్లో పలువురు ప్రయాణికులు గాయా లపాలయ్యారు. దీంతో అధికారులు శ్లాబ్ కింద ప్రయా ణికులను ఉంచకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్లాబ్ ప్రమాదకరంగా ఉందని సంబంధిత ఇంజనీరిం గ్ అధికారులు నిర్ధారించారు. శ్లాబ్‌ను వెంటనే కూల్చివేయాలని సూచించారు. ఈ మేరకు ఉన్నతాధి కారులకు నివేదికలు సమర్పించారు. ఇంజనీరింగ్ అధికారుల సూచనల మేరకు రెండు నెలల క్రితం సుల్తానాబాద్ బస్టాండ్ శ్లాబ్‌ను కూల్చివేశారు. ప్రయాణికుల కోసం పక్కనే తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటు చేశారు.



ఎండలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వర్షంలో గొడుగు కింద ఉన్న ప్రయాణికులు

● సరిపోని తడకల షెడ్డు..

అయితే ప్రయాణికులు ఉండేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తడకల షెడ్డు ఏమాత్రం సరిపోవడం లేదు. చాలా మంది ప్రయాణికులు ఎండలో బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండు నెలల నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నా కనీసం ఈ తాత్కాలిక షెడ్డు పైన సరైన కవర్లు కూడా పెట్టలేదు. దాంతో వర్షం వస్తే షెడ్డులో ఉన్న వారు తడుస్తున్నారు. చిన్న పిల్లలు మహిళలు చాలా అవస్థ లు పడుతున్నారు. కొంత మంది వెంట గొడుగులు తెచ్చుకోవడం అలవాటు చేసుకున్నారు.

● తొందరగా పనులు పూర్తి చేయాలి..

బస్టాండ్ మరమ్మతు పనులు తొందరగా పూర్తి చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. స్లాబ్ తొలగించిన అధికారులు అదే స్థానంలో రేకులు బిగించే పనులు చేయిస్తున్నారు. రేకులు బిగించిన తర్వాత ఇతర పనులనుకూడా పూర్తి చేయించాల్సి ఉంటుంది.

స్లాబ్ తొలగించిన ఆర్టీసీ అధికారులు మొత్తం శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూడా తీసి వేసి ప్రస్తుత ప్రజల అవసరాలకు తగ్గట్టుకు నూతన బస్టాండ్‌ను నిర్మాణం చేస్తే బావుండేదని వారు భావిస్తున్నారు. నిత్యం వందలాది బస్సులు పలువురు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుం టారు. ఇప్పటికైనా మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే 'నైట్‌హాల్ట్'

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 29: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నైట్‌హాల్ట్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు పేర్కొన్నారు. గ్రామాల్లో పోలీసుల నైట్‌హాల్ట్‌లో భాగంగా శనివారం రాత్రి వెంకట్రావ్‌పల్లెలో సీఐ గడిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రాజకీయ నాయకులు, యువకులు, పెద్దలతో సీఐ సమావేశమయ్యారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించే దిశగా పోలీసులు పనిచేస్తారని సీఐ పేర్కొన్నారు. గతంలో నమోదైన కేసులు, నేరాల వివరాలను తెలుసుకున్నారు. గ్రామస్థులు స్నేహభావంతో మెలగాలని, ఏదైనా సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంటుందని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

ధర్మారం, సెప్టెంబరు 29: మండల మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గందం మల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా కొడారి హన్మయ్య, గాండ్ల స్వామి, నార ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా ఆకుల రాజేందర్, రాసూరి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా ఆశవేని రాజ్‌కుమార్, ప్రచారకార్యదర్శిగా నార మహేందర్, సహాయ కార్యదర్శిగా జంగిలి సంతోష్, కోశాధికారిగా నార సురేందర్‌ను ఎన్నుకున్నారు.

పీఎల్ఆర్ బోనస్ రూ. 93,750

- న్యూఢిల్లీ సమావేశంలో నిర్ణయం

- గతేడాది కంటే 8,750 పెరుగుదల

శ్రీరాంపూర్, సెప్టెంబరు 29: దేశవ్యాప్త బొగ్గు గని కార్మికులకు యేటా అందించే పెర్‌ఫార్‌మెన్స్ లింక్‌డ్ రివార్డ్ (పీఎల్ఆర్) ఖరారైంది. కార్మికులు దీపావళి బోనస్‌గా పిలుచుకునే రివార్డును రూ. 93 వేల 750గా నిర్ణయించారు. ఆదివారం న్యూఢిల్లీలోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో జాతీయ సంఘాలైన బీఎంఎస్, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులతో కోల్ ఇండియా యాజమాన్యం సమావేశం నిర్వహించింది. ఇందులో లక్ష రూపాయల పీఎల్ఆర్ బోనస్ ఇవ్వాలని వారు చర్చ ప్రారంభించగా, చివరకు 93 ,750లుగా నిర్ణయమైంది. గతేడాది ఇది 85,500గా ఉండగా, ఈసారి 8,750 రూపాయలు పెరిగింది. ఈ బోనస్‌ను దేశవ్యాప్తంగా 2.5 కోట్ల మంది బొగ్గు గని కార్మికులు, సింగరేణిలో 42 వేల మంది కార్మికులు పొందనున్నారు. సమావేశంలో సింగరేణి నుంచి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డి, బీఎంస్ నుంచి సుధీర్ గురిడె, మజారుల్ అన్సారి, యాదగిరి సత్తయ్య, హెచ్ఎంఎస్ నుంచి నాథూలాల్ పాండే, శివ్‌కుమార్ యాదవ్, రియాజ్ అహ్మద్, ఏఐటీయూసీ నుంచి రామేంద్రకుమార్, సీఐటీయూ నుంచి డిడి రామానంద, ఆర్.పి. సింగ్ పాల్గొన్నారు.

భయం భయంగా ప్రయాణం

● ఇరుకు రోడ్డుతో ప్రమాదాలు

● రోడ్డు విస్తరణకు మోక్షం ఎప్పుడో?

కమాన్‌పూర్, సెప్టెంబరు 29: మండల కేంద్రం నుంచి పెంచికల్‌పేట మీదుగా గోదావరిఖని వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతో ప్రయాణికులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గోదావరిఖని నుంచి బసంత్‌నగర్ మీదుగా వెళ్తే టోల్ ట్యాక్స్ పడుతుందని సింగరేణి, ఎన్‌టీపీసీ, ఎఫ్‌సీఐకి చెందిన భారీ వాహనాలు కమాన్‌పూర్ మీదుగా పెద్దపల్లికి వెళ్లడంతో కమాన్‌పూర్ రోడ్డు వాహనాలతో రద్దీగా మారుతోంది. ఎన్నికల సమయంలో కమాన్‌పూర్ రోడ్డు సెంట్రల్ లైటింగ్‌తో అభివృద్ధి చేస్తామని హామీలు ఇవ్వడమే కానీ ఆచరణకు నోచుకోవడం లేదు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఆనుకొని బ్యాంక్ ఉండటంతో బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారుల వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శ్రీపాద విగ్రహం నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా సెంట్రల్ లైటింగ్‌తో రోడ్డు విస్తరణ పనులు చేపడితే ప్రమాదాల నివారణతో పాటు మండల కేంద్రానికి హంగులు వస్తాయని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకొని కమాన్‌పూర్ మండల కేంద్రంలోని రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పెంచిక ల్‌పేట రోడ్డు వెడల్పు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఇరుకుగా ఉన్న రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

● రోడ్డు విస్తరణ చేపట్టాలి

-నల్లవెల్లి శంకర్, కమాన్‌పూర్



మండల కేంద్రంలోని రోడ్డు భారీ వాహనాలతో రద్దీగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో రోడ్డు విస్తరణ చేస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప ఎవరూ అమలు చేయడం లేదు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే పాలకులు, అధికారు లు స్పందించి రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలి. ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం

సింగిల్ విండో చైర్మన్ గజవెల్లి పురుషోత్తం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెబరు 29: రైతుల సంక్షేమమే లక్ష్యంగా కునారం సింగిల్ విండో సొసైటీ పనిచేస్తుందని సింగిల్విండో చైర్మన్ గజ్వేల్ పురుషోత్తం అన్నారు. ఆదివారం సింగిల్ విండో సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గజవెల్లి పురుషోత్తం మాట్లాడుతూ 1962లో ప్రారంభమైన కునారం సొసైటీ రైతుల సహకారంతో అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు. 978మంది రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. సభ్యుల వాటా దనం 60.66లక్షల రూపాయలు కలిగి ఉందన్నారు. 2023-24 సంవత్సరం నికర లాభం 27.35లక్షల రూపాయలు ఉందన్నారు. స్వల్పకాలిక రుణ 278మందికి 2.29కోట్ల రూపాయలు, దీర్ఘకాలిక రుణాలు కర్షక మిత్ర కింద పది మందికి 54లక్షల రూపాయలు, ఇచ్చామని తెలిపారు. 965మంది రైతుల నుంచి 55,247క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేయగా దీనిపై కమిషన్ 5.19లక్షల రూపాయలు వచ్చాయన్నారు. కరెంటు ఖాతా నందు 9.38 లక్షల రూపాయలు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. మన సంఘంలో 212మంది సభ్యులకు 1.8కోట్ల రూపాయల రుణమాఫీ జరిగిందన్నారు. స్వల్ప కాలిక రుణాలు 382మంది సభ్యులకు 4.84కోట్ల రూపాయలు, దీర్ఘకాలిక రుణాలు 95మంది సభ్యులకు 2.84కోట్ల రూపాయలు రుణం ఇచ్చామని వివరించారు. గోదాం నిర్మాణం కోసం 20గుంటల స్థలం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. సొసైటీ భవనం కోసం రూ.26 లక్షలు బ్యాంకులో నిల్వ ఉన్నాయని వివరించారు. దివంగత మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి సహకారంతో ఈ సొసైటీ కునారంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, సింగిల్ విండో వైస్ చైర్మన్, బీసగొని తిరుపతి, మాజీ సర్పంచ్ డొంకేన విజయ మొగిలి, మాజీ ఎంపీటీసీ కొల్లూరి రమాదేవి రాజమల్లు, సొసైటీ సీఈఓ విజయేందర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొట్టే సమ్మయ్య, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పురుషోత్తం

కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే వివేక్

సుల్తానాబాద్, సెప్టెంబరు 29: పెద్దపల్లి నియోజకవర్గంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా, కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి అనుచరుడిగా పనిచేసిన గజభీంకార్ నర్సోజీని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదివారం పరామర్శించారు. నర్సోజీకి ఇటీవల కాలు సర్జరీ అయి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల సుల్తానాబాద్‌కు చేరుకున్నాడు. వివేక్ వెంకటస్వామి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పవన్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంథని, సెప్టెంబర్ 29: పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పరామర్శించారు. మంథని మండలంలోని కన్నాలలో మాజీ ఎంపీటీసీ భర్త శారద భర్త పోయిల గట్టయ్య, ఉడుత నారాయణ, మల్లెపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆత్కూరి నర్సయ్య, ముత్తారం మండలంలోని మచ్చుపేటలో చిలివేరి మల్లమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పుట్ట మధు పరామర్శించారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షురాలు భర్త రాజయ్యను పుట్ట మధు పరామర్శించారు.



గోదావరిఖనిలో గీతాంజలి హైస్కూల్ పూర్వవిద్యార్థులు..


సుల్తానాబాద్ పట్టణంలోని లింగేశ్వర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సుల్తానాబాద్/ఓదెల/కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 29: జిల్లాలోని పలు మండలాల్లో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుల్తానాబాద్ పట్టణంలోని లింగేశ్వర ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1993-1994 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, ఓదెల జిల్లా పరిషత్ పాఠశాల 2004-05లో పదో తరగతి విద్యార్థులు, గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గీతాంజలి హైస్కూల్ 2007 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిననాటి మధుర జ్ఞాపకానాలను గుర్తు చేసుకున్నారు. అప్యాయంగా పలకరించుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు.


ఓదెల జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు

వీర్లపల్లెలో పోలీసుల కార్డన్ సెర్చ్


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 29: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీర్లపల్లె గ్రామంలో సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్టులో భాగంగా ఆదివారం తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో పలు ఇళ్లను తనిఖీ చేశారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సీఐ ప్రసాదరావు మాట్లాడారు. గ్రామంలో కొత్త వ్యక్తులకు ఆశ్రయం తీసుకుని ఉంటే సమాచారం ఇవ్వాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా గ్రామస్థులు జాగ్రత్త వహించాలని అటువంటి కార్యకలాపాలు జరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి చెడువ్యసనాల జోలికి వెళ్లకుండా ఉత్తమ పౌరులుగా మెలగాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వాహనాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సీఐ గ్రామస్థులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులతో సహకరించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ ప్రసాదరావు కోరారు. కార్యక్రమంలో సీఐ-2 లింగమూర్తి, ఎస్సైలు వెంకటేశ్వర్, ఫరీద్, అహ్మదుల్లా, ప్రసాద్, శ్రీనివాస్, భూమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాన్ హోల్‌కు మరమ్మతులు

- 'ఆంధ్రజ్యోతి' కథకానికి స్పందన

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 29: ఈ నెల 20న 42వ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లోని మార్వాడ్ స్ట్రీట్‌లో 'నోరు తెరిచిన మ్యాన్ హోల్' అనే కథనానికి కార్పొరేటర్ స్పందించారు. ఆదివారం కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేసి మ్యాన్ హోల్ కవర్‌ను ఏర్పాటు చేశారు.


మ్యాన్ హోల్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మయ్య

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 29: ప్రభుత్వ ఐటీఐ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొట్టె లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఎన్నికలు ఆదివారం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి కొండబత్తుల అంజనేయులు, గంగుల శేఖర్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా గుంటి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా చింతపండు రాజమల్లు, సంయుక్త కార్యదర్శిగా అలుగువెల్లి కృష్ణారెడ్డి, కోశాధికారిగా దిటీ సతీష్, కార్యవర్గ సభ్యులుగా ధరణి సతీష్, గోపు శ్రీనివాస్, ఏలువాక రమేష్, వేముల రాజమౌళి, గండు వెంకన్న, బండారి వెంకన్న, ఉనుకొండ సునీల్, వైద్యుల వెంకటరమణ, రాచూరి శ్రీకాంత్, ఎడవల్లి చంద్రారెడ్డి, వేముల నరేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గాన్ని సన్మానించారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో కౌశికహరి పూజలు

ఓదెల, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని బ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం రామగుండం 22వ డివిజన్ కార్పొరేటర్, కేశోరాం కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామిని దర్శించుకొని అభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు వారికి మల్లికార్జునస్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు సన్మానం

ఓదెల, సెప్టెంబరు 29: ఓదెల మండలం పొత్కపల్లిలో సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి పెద్దపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకం అయిన సందర్భంగా బాల్యమిత్రులు ఆదివారం ఘనంగా సన్మానించారు. తోటి మిత్రుడైన ఆళ్ల దేవేందర్‌రెడ్డి కరీంనగర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన సందర్భంగా తోటి విద్యార్థులు, బాల్యమిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంగ శ్రీనివాస్, రెడ్డి నవీన్ కుమార్, వంగ కుమారస్వామి, ఆళ్ల దేవేందర్ రెడ్డి, ఆళ్ళ సురేందర్‌రెడ్డి, కదార్ల మధుకర్, రాగిడి మహేందర్‌రెడ్డి, గుండ్లపెల్లి రాజేందర్, ఆళ్ళ తిరుపతిరెడ్డి, రాచకట్ల వేణు, మూల శ్రీనివాస్, కర్నే పవన్ కుమార్, కర్నె చిట్టిబాబు, ఆకునూరి రగోతం రెడ్డి, ఆడేపు శ్రీనివాస్, వేయిగండ్ల వెంకట రాజ్, ఎండి బాబాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 20వేల సభ్యత్వాలు పూర్తి

బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ


సభ్యత్వ నమోదు చేయిస్తున్న క్యాతం వెంకటరమణ

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 29: జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతంగా సాగుతుందని సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ చెప్పారు. ఆదివారం 38వ డివిజన్ ఇందిరానగర్‌లో ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జిల్లాలో సభ్యత్వ నమోదు చేయడానికి ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. పట్టణాలు, గ్రామాల్లో రైతులు, మహిళలు, యువకులు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధికంగా స్థానాలను గెలుచుకుంటుందని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 20వేల సభ్యత్వం పూర్తయ్యిందని, జిల్లాలో లక్ష సభ్యత్వ నమోదు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లక్ష్మీనగర్ మండల అధ్యక్షుడు కోడూరి రమేష్, అపర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ట్రినిటి విద్యార్థి ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 29: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటి కళాశాలకు చెందిన విద్యార్థిని తూముల నేహ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయిలో ఎంపికైంది. ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలో పాల్గొని రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓదెలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో కామారెడ్డి జిల్లాలో వచ్చే నెల 4 నుంచి 6 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

'సదాశయ' ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

ఓదెల, సెప్టెంబరు 29: సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో ఓదెల లోని లక్ష్మి ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో ఎల్‌వీపీ వారి సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ నేత్ర, అవయవ, శరీర దానాలపై కృషి చేస్తూ ఎందరో బాధితులకు వెలుగులు పంచుతోందని ప్రశంసించారు. శిబిరంలో 300మందికి పరీక్షలు చేసి పలువు రికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, డాక్టర్ మేరుగు భీష్మాచారి, అల్లం సతీష్, డాక్టర్ కోండ్ర వేణు, క్యాతం మల్లేశం, డాక్టర్ వెంకటేశ్వర్లు, సంతోష్, నిఖిల్, సారంగం, క్యాతం వెంకటేశ్వర్లు, సాయి కృష్ణ మరియు ఎల్‌వీపీ నుంచి డాక్టర్ సుబ్బారావు, లోకేష్, కృష్ణ పాల్గొన్నారు. ఉచిత నేత్ర పరీక్షల శిబిరం నిర్వహించిన ఎల్‌వీపీ వారికి, విజయవంతం చేసిన డాక్టర్ భీష్మాచారి బృందానికి,సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అభినందనలు తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఏఈవోకు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెబరు 29: కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారంలో వ్యవసాయశాఖలో ఏఈవోగా పనిచేసిన ఎర్ర రాజు సుల్తానాబాద్ మండలం కనుకులకు బదిలీపై వెళ్లారు. ఆదివారం పలువురు నాయకులతో పాటు రైతులు కూనారం రైతువేదికలో ఏఈవోను శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, సింగిల్‌విండో చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, సీఈఓ విజయేందర్, మాజీ సర్పంచ్ డొంకెన విజయ మొగిలి, మాజీ ఎంపీటీసీ కొల్లూరి రమాదేవి రాజమల్లు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొట్టే సమ్మయ్య, సింగిల్ విండో సొసైటీ ఉపాధ్యక్షుడు బిసగోని తిరుపతి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

ఆలయంలో పారదర్శక సేవలు

కమాన్‌పూర్, సెప్టెంబర్ 29 : మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయంలో అక్రమాలకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా సేవలు అందుతాయని ఆలయ ఈవో కాంతారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి ఆలయంలో వస్తున్న ఆరోపణల దృష్ట్యా పూర్తి కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఇప్పటి వరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు రాలేదని, ఎవరైనా బాధితులు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. భక్తులు ఎవరైనా మొక్కుల చెల్లింపులు కానీ, అన్నదానాలకు గానీ వస్తురూపేనా, డబ్బు రూపేనా సిబ్బందికి చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు.

'కుమారస్వామి ఆశయ సాధనకు కృషి'

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 29: దివంగత ఐఎఫ్‌టీయూ నాయకుడు కొదురుపాక కుమారస్వామి ఆశయ సాధనకు కృషిచేయాలని ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఐ కృష్ణ పిలుపునిచ్చారు. కుమారస్వామి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఐ కృష్ణ మాట్లాడారు. కార్మిక వర్గంలో పోరాటస్ఫూర్తి మసక బారుతున్నదని, ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొనక పోవడానికి ప్రభుత్వ విధానాలే కారణమని పేర్కొన్నారు. రామగుండం ఏరియాలో విప్లవపంథాలో కార్మికుల హక్కుల కోసం పోరాడిన కుమారస్వామి 1991 సెప్టెంబరు 29న అర్ధరాత్రి అరాచకశక్తులు దారుణంగా హతమార్చాయన్నారు. అనంతరం కుమారస్వామి స్థూపానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు బీ అశోక్, ఈ నరేష్, మల్లేష్, రాజనర్సు, బుచ్చమ్మ, రాజేశ్వరి, నాగరాజు, రవి, సరోజన పాల్గొన్నారు.

గాంధీ సాహిత్యం పంపిణీ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 29: గాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గాంధీ మహాత్ముని సూక్తులు, కస్తూరిబా గాంధీ వయోజన విద్యామాల మరియు సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు సంబంధించిన సాహిత్యాన్ని పెద్దపల్లిలో పంపిణీ చేస్తామని పెద్దపల్లి జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గాంధీ స్మారక నిధి హైదరాబాద్ వారిచే ప్రచురితమైన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తామని పుస్తకాలు కావాల్సినవారు 9177990879 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.